భవనాలు భద్రమేనా?

- 8వ వార్డులో జోరుగా అనధికార నిర్మాణాలు
- పాత భవనాలపై అదనపు అంతస్తులు
- బిల్డింగ్ ఒరిగిన ఘటనతో ఆందోళనలో స్థానికులు
- పట్టించుకోని పట్టణ ప్రణాళికా విభాగం అధికారులు


భువనేశ్వర్ కాలనీలో పాత ఇంటిపై అదనపు అంతస్తులు


రాజీవ్‌నగర్‌లో నిర్మిస్తున్న అదనపు అంతస్తులు


ఎస్ఎస్ కాలనీలో పాత ఇంటిపై కొత్త నిర్మాణం

కొమ్మాది: జీవీఎంసీ జోన్-2 పరిధి 8వ వార్డులో అడ్డగోలుగా అక్రమ నిర్మాణాలు, పాత భవనాలపై కొత్త నిర్మాణాలు జోరుగా సాగుతున్నాయి. వీటిపై టౌన్ ప్లానింగ్ విభాగం అధికారులు ఎటువంటి చర్యలు తీసుకోకపోవడంతో, వారి తీరుపై అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ఎండాడ, రాజీవ్‌నగర్, గొల్లల ఎండాడ, భువనేశ్వర్ కాలనీ, సాగర్‌నగర్ ప్రాంతాల్లో పలు చోట్ల పాత భవనాలపై కొత్త నిర్మాణాలు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయి. వీటికి ప్లాన్ ఉందా అంటే లేదు. సెట్‌బ్యాక్ ఉన్నాయా అంటే లేవు. కొన్ని చోట్ల వెళ్లేందుకు దారి కూడా లేదు. అయినా నిర్మాణాలు మాత్రం యథేచ్ఛగా చేసేస్తున్నారు. అయితే పాత భవనాలపై కొత్త నిర్మాణాలు కట్టడం వలన ప్రమాదాలు పొంచి ఉన్నా, ప్లానింగ్ సెక్రటరీ కానీ, బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్ కానీ, టీపీవో గానీ పట్టించుకోవడం లేదు. ఇటీవల వైజాగ్‌లో ఒక భవనం మరో భవనంపై ఒరిగిపోవడం ఆందోళన కలిగించింది. ఇంత జరిగినా అధికారుల్లో కనీసం మార్పు రాకపోవడం ప్రజలను విస్మయానికి గురి చేస్తోంది. ఈ నిర్మాణాలకు పట్టణ ప్రణాళికా విభాగం నుంచి అనుమతులు లేవు. ఒక అధికారి కూడా వచ్చి పరిశీలించిన సందర్భాలు లేవు. రోడ్లకు, డ్రైనేజీలకు, ఒకదానితో ఒకటి ఆనుకుని నిర్మాణాలు చేపడుతున్నా అధికారులు ఎందుకు మౌనం వహిస్తున్నారనేదే అందరిలో ప్రశ్న. ఇప్పటికైనా ప్రణాళికా విభాగం అధికారులు స్పందించి చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

సాగర్‌నగర్‌లో..

30 సంవత్సరాల క్రితం ఇక్కడ ఎల్ఐజీ, ఎంఐజీ, హెచ్ఐజీ గృహ సముదాయాలు నిర్మించారు. అవి ఇప్పుడు అక్కడక్కడ శిథిలావస్థకు చేరుకుంటున్నాయి. అయితే, వాటిపైనే ఒకటి రెండు అంతస్తులను యథేచ్ఛగా నిర్మించేస్తున్నారు. ఇది భవిష్యత్తులో ప్రమాదాలకు కారణమవుతుందని పరిసరప్రాంతాల వారు ఆందోళన చెందుతున్నారు. సచివాలయం సమీపంలోనే నిర్మాణాలు జరుగుతున్నా ఒక్క అధికారి ఇటుగా చూడకపోవడం ఆశ్చర్యకరం. అంతేకాదు, అప్పటి నిర్మాణాల్లో సెల్లార్లు లేకపోవడంతో కొంత కామన్ ప్లేస్ కేటాయించారు. ఇప్పుడు అవి కూడా ఆక్రమించి నిర్మాణాలు కొనసాగించేయడం గమనార్హం.

ఎండాడలో..

ఎండాడ, రాజీవ్‌నగర్, భువనేశ్వర్ కాలనీ, బీసీ కాలనీ, ఎస్సీ కాలనీ, దుర్గానగర్, సుభాష్‌నగర్ ప్రాంతాల్లో పాత భవనాలపై కొత్త భవనాల నిర్మాణం జోరుగా సాగుతోంది. ఇదంతా కొండ ప్రాంతం. ఇక్కడికి చేరుకోవాలన్నా కాస్త ఇబ్బందే. ఒక ఇంటిని మరో ఇంటితో ఆనుకుని గతంలో ఇక్కడ నిర్మాణాలు చేపట్టారు. ప్రస్తుతం ఆ పాత భవనాలపైనే కొత్త నిర్మాణాలు చేపట్టడంతో స్థానికుల్లో భయం మొదలైంది. వీటిలో ఏ భవనం ఒరిగినా చుట్టూ భవనాలకు పెను ప్రమాదమే. పొరపాటున ఏదైనా జరిగితే ఘటనా స్థలికి చేరుకోవాలన్నా కష్టమే.


సాగర్‌నగర్‌లో 30 సంవత్సరాల క్రితం కట్టిన ఇంటిపై అదనపు అంతస్తుల నిర్మాణం

అలాంటి నిర్మాణాలు నిలిపివేస్తాం

8వ వార్డులో జరుగుతున్న అక్రమ నిర్మాణాలు, పాత భవనాలపై కొత్త నిర్మాణాలు పూర్తి స్థాయిలో పరిశీలిస్తాం. నిబంధనలకు విరుద్ధంగా ఉన్న నిర్మాణాలను తక్షణమే నిలిపివేస్తాం. అనుమతులు లేకుండా ఏ ఒక్కరు నిర్మాణాలు చేపట్టినా చర్యలు కఠినంగా ఉంటాయి.

– శాస్త్రి సబనస్, అసిస్టెంట్ సిటీ ప్లానర్

గణపతి లడ్డూ @ రూ.2.16లక్షలు


పాటదారులు రాము, రామారావుకు లడ్డూ అందజేస్తున్న నిర్వాహకులు

మధురవాడ: చంద్రంపాలెం భారీ గణనాథుని 111కేజీ లడ్డూ ధర రు. 2,16,016 రూపాయలు పలికింది. దీనిని స్వతంత్రనగర్‌కి చెందిన కర్రి రామారావు, చంద్రంపాలేనికి చెందిన పిల్లా రాములు వేలం పాటలో సొంతం చేసుకున్నారు. ఉత్సవ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు ఇరువురిని సత్కరించి, లడ్డూ అందజేశారు.

ఒరిగిపోయిన ఫీడర్ పిల్లర్


ఒకవైపు ఒరిగిపోయిన పవర్ డిస్ట్రిబ్యూషన్ బాక్స్

కొమ్మాది: జీవీఎంసీ 8వ వార్డు ఎస్ఎల్‌పీ లేఅవుట్ సమీపంలో అండర్ విద్యుత్ వైర్లకు సంబంధించిన ఫీడర్ పిల్లర్ ఒక వైపుగా ఒరిగిపోయింది. ప్రస్తుతం వర్షాలు పడుతున్న నేపథ్యంలో ఎవరికి ఏ ప్రమాదం సంభవిస్తుందో తెలియని పరిస్థితి. సంబంధిత అధికారులు పరిశీలించి, చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

క్లుప్తంగా

క్యాన్సర్ బాధితురాలికి సాయం


సరోజినికి రూ.10 వేలు అందిస్తున్న ఫ్యాబ్ ప్రతినిధులు

భీమునిపట్నం: క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్న మహిళలకు ఫ్రెండ్స్ అసోసియేషన్ ఆఫ్ భీమిలి (ఫ్యాబ్) శనివారం ఆర్థిక సాయం అందించింది. తగరపువలసకు చెందిన పోతుల సరోజిని క్యాన్సర్ వ్యాధితో ఇబ్బంది పడుతున్నారు. విషయం తెలుసుకున్న ఫ్యాబ్ అధ్యక్షుడు కాళ్ల సన్నీ ఆమె చికిత్స కోసం రూ. పదివేలు అందించారు. కార్యక్రమంలో సభ్యులు ఎం.సూర్య శ్రీనివాస్, గుగ్గిళ్ల సాయి, మారోజు గోపి, వి.సత్యనారాయణ పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం నేడు

తగరపువలస: ఆనందపురం మండలం గిడిజాల 33/11 కేవీ సబ్‌స్టేషన్ పరిధిలో ఆదివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని అధికారులు తెలిపారు. ఈ కారణంగా గిడిజాల, గిడిజాల ఎన్టీఆర్ కాలనీ, బాకూరుపాలెం, చిన్నయ్యపాలెం, మిందివానిపాలెం, గొంతినవానిపాలెం గ్రామాలకు విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

అత్యధిక కంటి ఆపరేషన్లు చేయించిన సత్యసాయికి సన్మానం


మానాపురం సత్యసాయిని సన్మానిస్తున్న శంకర్ ఫౌండేషన్ కంటి ఆసుపత్రి సిబ్బంది

తగరపువలస: సత్యసాయి సేవాసంస్థ విశాఖ జోన్-1లో 25 గ్రామాల్లో అత్యధికంగా 420 మందికి కంటి ఆపరేషన్లు చేయించిన చిట్టివలస సత్యసాయి సేవా సంస్థలకు చెందిన మానాపురం సత్యసాయికుమార్‌ను శంకర్ ఫౌండేషన్ ప్రతినిధులు శనివారం ఘనంగా సన్మానించారు. ఆయన చేసిన సేవలను చిట్టివలస సమితి ప్రతినిధులు కొనియాడారు. కార్యక్రమంలో ఆస్పత్రి డైరెక్టర్లు విజయకుమార్, కృష్ణకుమార్, ఏజీఎం రమేష్, వేణుగోపాల్, క్యాంప్ మేనేజర్ అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

మండల పరిషత్ సాధారణ సమావేశం రేపు

తగరపువలస: భీమిలి మండల పరిషత్ సాధారణ సమావేశం సోమవారం మధ్యాహ్నం 2.30 గంటలకు మండల పరిషత్ సమావేశ మందిరంలో నిర్వహించనున్నట్లు ఎంపీడీవో కేవీ నరసింహారావు తెలిపారు. వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరు కావాలని కోరారు.

ముగ్గురికి కార్పొరేషన్ డైరెక్టర్ పదవులు

మధురవాడ: ఏపీ నగరాలు కార్పొరేషన్ డైరెక్టర్లుగా మధురవాడకు చెందిన ముగ్గురు కూటమి నాయకులు నియమితులయ్యారు. వీరిలో మధురవాడ ఆదిత్యనగర్‌కు చెందిన టీడీపీ నాయకుడు, మధురవాడ పౌర సంక్షేమ సంఘం అధ్యక్షుడు నాగోతి సూర్యప్రకాశరావు ఒకరు. ఈయన గతంలో చంద్రంపాలెం జెడ్పీ హైస్కూల్ విద్యాకమిటీ చైర్మన్‌గా కూడా పని చేశారు. పోతిన పైడిరాజు, నాగోతి అనితలను కూడా కార్పొరేషన్ డైరెక్టర్ ఈ పదవులు వరించాయి.

అసోసియేట్ ప్రొఫెసర్‌కు బెస్ట్ మెంటార్ అవార్డు


నవీన్‌ను అభినందిస్తున్న ఇతర అధ్యాపకులు

మధురవాడ: మధురవాడలోని ఓ ప్రైవేట్ కళాశాలలో పని చేస్తున్న అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ పి.ఎస్.ఇ.నవీన్‌కు బెస్ట్ మెంటార్‌గా పురస్కారం లభించింది. కౌన్సిల్ ఫర్ స్కిల్స్ అండ్ కాంపిటెన్సీస్ (సీఎస్‌సీ ఇండియా) విశాఖలో ఈ అవార్డును ఆయనకు అందించింది. నవీన్ ఇటీవలే మెకానికల్ ఇంజినీరింగ్‌లో పీహెచ్‌డీ పూర్తి చేశారు. అవార్డు అందుకున్న సందర్భంగా నవీన్‌ను పలువురు అభినందించారు.

రాయపాలెంలో ఈగల మోత


ఇంటి నేలపై ఈగలు


వంటపాత్రలపై ఈగలు

- ఆహార పదార్థాలు కలుషితం
- స్థానికుల అవస్థలు

తగరపువలస: జీవీఎంసీ భీమిలి జోన్ రెండో వార్డు రాయపాలెంలో ఈగల కారణంగా అక్కడి ప్రజలు నిత్యం ఇబ్బంది పడుతున్నారు. గ్రామంలో పూర్తిగా డ్రైనేజీలు లేకపోవడం, పారిశుధ్య పరిస్థితులు సరిగా లేకపోవడంతో ఇళ్ల చుట్టూ, ఇళ్లలో పల ఈగలు తిష్టవేసి స్థానికులకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. నిద్రపోదామన్నా ముఖంపై ముసురుతూ నిద్రాభంగం చేస్తున్నాయని వాపోతున్నారు.

విషజ్వరాల వ్యాప్తి

వంటగది, బెడ్ రూమ్, వాష్‌రూమ్, డాబాలపై వందల సంఖ్యలో ఈగల గుంపుల కారణంగా తాగు నీరు, తినే పదార్థాలు కలుషితమవుతున్నాయి. దీంతో గ్రామంలో విషజ్వరాలు ప్రబలుతున్నాయి. ఏడాది క్రితం ఇదే గ్రామంలో కోళ్ల ఫారాల నిర్వహణ కారణంగా ఈగల మోతతో స్థానికులు ఇబ్బంది పడిన సంగతి తెలిసిందే. ప్రస్తుతం కోళ్ల ఫారాలు లేకపోయినా అపారిశుధ్య పరిస్థితులే కారణమని గ్రామస్తులు వాపోతున్నారు. గ్రామంలో డ్రైనేజీలను శుభ్రం చేసి రసాయనాలు పిచికారి చేయించాలని అలాగే వీధులలో చెత్తను ఊడ్చి బ్లీచింగ్ చల్లించాలని గ్రామస్తులు కోరుతున్నారు. గ్రామంలో పూర్తిగా ఇంటింటా టాయిలెట్లు లేకపోవడంతో బహిరంగ మల విసర్జన కూడా ఈగల మోతకు కారణమని అంటున్నారు. జీవీఎంసీ అధికారులు స్పందించి పారిశుధ్య నిర్వహణపై దృష్టి సారించాలని, స్థానికులకు కూడా అవగాహన కల్పించాలని పలువురు కోరుతున్నారు.

సర్వీస్ రోడ్డుపై నిలిచిన వర్షంనీరు


ఆనందపురం మండలం వెల్లంకి సర్వీస్‌రోడ్డుపై నిలిచిన వర్షం నీరు

తగరపువలస: వర్షం కురిసిన ప్రతీసారి ఆనందపురం మండలం వెల్లంకి సర్వీస్‌రోడ్డుపై నీరు నిలిచిపోవడంతో వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. మండలంలో వెల్లంకి పంచాయతీ నుంచి పెద్దిపాలెం వరకు సర్వీస్‌రోడ్డును ఆనుకుని డ్రైనేజీలు పూడుకుపోవడంతో పాటు నిర్మాణ లోపాలతో కూడుకుని ఉన్నాయి. అంతేకాకుండా ఇక్కడ చాలాచోట్ల డ్రైనేజీలపై సిమెంట్ శ్లాబులు శిథిలమైపోయి ఉన్నాయి. దీంతో సాధారణ రోజుల్లోనే మురుగునీరు పొంగి రహదారిపై నుంచి పారుతూ ఉంటుంది. ఇక వర్షాకాలం అయితే పరిస్థితి చెప్పనలవి కాకుండా ఉంది. వర్షం తగ్గిన తర్వాత వారం రోజుల వరకు నీరు నిలిచి ఉండిపోవడంతో వాహనాలు మొరాయించడం, నడిచి వెళ్లేవారిపై నీళ్లు తుళ్లడం వంటి సంఘటనలతో పలువురు ఇబ్బంది పడుతున్నారు. పెద్దిపాలెం నుంచి వెల్లంకి వరకు ఇరు పంచాయతీలలో రెండు వైపులా డ్రైనేజీలకు మరమ్మతులు నిర్వహించాలని ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.

ఉక్కు ప్రైవేటీకరణను అడ్డుకోవాలి



పీఎం పాలెంలో పాదయాత్ర చేస్తున్న సీపీఎం నాయకులు కార్యకర్తలు

పీఎం పాలెం: 'విశాఖ ఉక్కు.. ఆంధ్రుల హక్కు' నినాదంతో సాధించుకున్న స్టీల్ ప్లాంట్‌ను ప్రైవేటీకరిస్తే ఊరుకోబోమని సీపీఎం నాయకులు స్పష్టం చేశారు. ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పీఎం పాలెంలో శనివారం నిర్వహించిన పాదయాత్రలో సీపీఎం జిల్లా నాయకుడు డి.అప్పలరాజు మాట్లాడారు. అమరుల త్యాగాలు వృథా కాకుండా, ప్రైవేటీకరణను అడ్డుకోవడం అందరి బాధ్యత అన్నారు. స్టీల్ ప్లాంట్‌ను ఎక్స్‌ప్రెషన్ ఆఫ్ ఇంట్రెస్ట్ (ఈవోఐ) పేరుతో యూనిట్ల వారీగా ముక్కలు చేసి కేంద్ర ప్రభుత్వం అమ్మకానికి పెట్టిందని, దీనిని ప్రజలంతా అడ్డుకోవాలని కోరారు. పీఎం పాలెం, గాయత్రీ నగర్, ఎస్సీ కాలనీ, లక్ష్మీవానిపాలెం తదితర ప్రాంతాల్లో ఈ పాదయాత్ర సాగింది. నాయకులు ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు పంపిణీ చేశారు.

11న సభను జయప్రదం చేయాలి

విశాఖ ఉక్కు పరిరక్షణకు ఈ నెల 11వ తేదీన గాజువాకలో జరగనున్న సభకు సీపీఎం కేంద్ర కమిటీ ప్రధాన కార్యదర్శి ఎంఏ బేబీ, రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు హాజరు కానున్నారని తెలిపారు. ఈ సభకు ప్రజలు పెద్ద ఎత్తున తరలి రావాలని కోరారు. కార్యక్రమంలో సీహెచ్ శేషబాబు, ఎస్.రామప్పడు, డి.సూరిబాబు, కె.నాగరాజు, కె.అర్జునమ్మ, బి.సూరిబాబు, బి.ఆదిలక్ష్మి, ఉమ తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా జ్యూట్‌మిల్లు ప్రహరీ


ఇటీవల వర్షాలకు లోపలివైపు కూలిన జ్యూట్‌మిల్లు ప్రహరీ


బీటలు వారిన ప్రహరీ


శిథిలమై ఇలా..

తగరపువలస: చిట్టివలస జ్యూట్‌మిల్లు ప్రహరీ ప్రమాదకరంగా ఉంది. చిట్టివలస గ్రామానికి వెళ్లే బీటీ రోడ్డును ఆనుకుని ఉన్న ఈ ప్రహరీలో మొక్కలు మొలిచిన కారణంగా ఎక్కడికక్కడ శిథిలమైపోయింది. ఇటీవల వర్షాలకు ఈ ప్రహరీ కూడా అక్కడకక్కడ కూలుతూ వస్తోంది. ప్రహరీ లోపలి వైపు కూలితే ఫర్వాలేదు కానీ, బీటీ రోడ్డు వైపు కూలితే మాత్రం పెను ప్రమాదమే పొంచి ఉంది. సుమారు 12 అడుగుల పొడవు, అడుగు వెడల్పుతో ఉండే గోడ ఎవరిపై అయినా పడితే ప్రాణాలకే ప్రమాదం జరిగే ఆస్కారం ఉంది. ఇటువైపుగా తిరుమల విద్యాసంస్థలు, శారదా పబ్లిక్ స్కూల్, శ్రీకృష్ణా జూనియర్, డిగ్రీ కళాశాలలకు చెందిన వేలాది మంది విద్యార్థులు నిత్యం ప్రయాణిస్తుంటారు. అలాగే, బస్సులతో పాటు చిట్టివలస, శ్రీరామ్‌నగర్, మూలకుద్దు, చిట్టివలస కళ్లాల ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. జీవీఎంసీ అధికారులు స్పందించి, ముందు జాగ్రత్తగా మూతపడిన మిల్లు ప్రహరీని తొలగించి ప్రమాదాలను నివారించాలని ఈ ప్రాంత ప్రజలు కోరుతున్నారు.

సింహగిరిపై ముగిసిన పవిత్రోత్సవాలు


అప్పన్నకు తిరువీధి నిర్వహిస్తున్న వేదపండితులు

సింహాచలం : సింహగిరిపై ఐదు రోజులుగా జరుగుతున్న పవిత్రోత్సవాలు శనివారంతో ఘనంగా ముగిశాయి. పవిత్రోత్సవాల్లో భాగంగా ఉదయం ఏకాంత స్నపనం విశేషంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారి ఉత్సవమూర్తులైన గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను ఆలయ భోగమండపంలోకి వేంజేంపుజేసి పంచామృతాలు, గంగాధర జలాలతో అభిషేకం జరిపారు. అనంతరం విశేషంగా హారతులు అందజేశారు. అలాగే సాయంత్రం ఉత్సవ మూర్తులకు ఆలయ బేడామండపంలో తిరువీధి నిర్వహించి, ప్రత్యేక హారతులు సమర్పించారు. కార్యక్రమాలను ఆలయ స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్, ప్రధాన అర్చకులు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, కరి సీతారామాచార్యులు నిర్వహించారు. సూపరింటెండెంట్ సత్యశ్రీనివాస్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

హెరిటేజ్ ఫెస్ట్ విజేతలకు బహుమతులు



బహుమతులు అందుకున్న చిన్నారులతో నిష్కించిన భక్తదాస


బహుమతులు అందుకునేందుకు హాజరైన విద్యార్థులు

తగరపువలస: ఆనందపురం మండలం ఐఐఎంవీ రోడ్డులోని హరేకృష్ణ వైకుంఠంలో హెరిటేజ్ ఫెస్ట్-2025 పేరుతో గత నెల 2 నుంచి 11వ తేదీ వరకు హరేకృష్ణ మూవ్‌మెంట్ ఆధ్వర్యంలో నిర్వహించిన వివిధ పోటీల్లో విజేతలకు శనివారం బహుమతులు అందజేశారు. శ్రీ రాధా మదన్ మోహన మందిరంలో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో హరేకృష్ణ మూవ్‌మెంట్ అధ్యక్షుడు నిష్కించిన భక్తదాస మాట్లాడారు. 36 పాఠశాలల నుంచి 2600 మంది బాలబాలికలు ఈ పోటీలలో పాల్గొన్నారన్నారు. వారిలోని సహజసిద్ధమైన ప్రతిభను వెలికితీసి సనాతన సంస్కృతికి దగ్గర చేయడమే ఈ హెరిటేజ్ ఫెస్ట్ లక్ష్యమన్నారు. అంబరీష దాస తదితరులు పాల్గొని విజేతలకు బహుమతులు అందించారు. 1,2 తరగతులు, 3,4 తరగతులు, 5,6,7 తరగతులు, 8,9,10 తరగతులను విభాగాలుగా విభజించి, విజేతలకు ప్రథమ, ద్వితీయ బహుమతులు అందజేశారు.

45 మంది గురువులకు సత్కారం


హెచ్ఎం శంకరరావును సన్మానిస్తున్న ఎంపీపీ రాంబాబు, జెడ్పీ వైస్ చైర్మన్ గిరిబాబు

పద్మనాభం: సమాజానికి గురువులే మార్గ నిర్దేశకులని ఎంపీపీ కంటుబోతు రాంబాబు, జెడ్పీ వైస్ చైర్మన్ సుంకర గిరిబాబు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు కోరాడ లక్ష్మణరావు అన్నారు. మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో శనివారం నిర్వహించిన ఉపాధ్యాయ దినోత్సవంలో వారు మాట్లాడారు. సమాజంలో ఏ వృత్తికి లేని గుర్తింపు ఉపాధ్యాయ వృత్తికి ఉందన్నారు. ప్రతి ఏడాది ఉపాధ్యాయ దినోత్సవం రోజున ఉపాధ్యాయులను సన్మానిస్తున్నామన్నారు. దీనిలో భాగంగా 43 మంది ఉపాధ్యాయులను, ఇద్దరు సీఆర్ఎంటీలను ఘనంగా సత్కరించి, జ్ఞాపికలను అందజేశారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో మీనా కుమారి, ఎంఈవోలు పి.రమణ, ఎస్‌డీ బాబూలాల్, ఆర్ఐ శ్యామల, వైఎస్సార్‌సీపీ నాయకులు బోని సన్యాసినాయుడు ఈర్ల ఈశ్వరావు, బుగత సత్యనారాయణ, డీసీఈబీ కార్యదర్శి ఎంవీ కృష్ణ కుమార్, ఉపాధ్యాయ సంఘ నాయకులు ఆర్.జగదీష్ బాబు, ఎ.అరుణ్ కుమార్, బి.సూర్యనారాయణ, ఎం.వి.ఎస్.ఎన్.రెడ్డి, రామారావు పాల్గొన్నారు.

ముగిసిన గణపతి నవరాత్రి ఉత్సవాలు


గంభీరం నుంచి నిమజ్జనానికి తరలించే ముందు మండపం వద్ద ఉత్సవ కమిటీ


సంతపేట గొల్లవీధి నుంచి నిమజ్జనానికి లంబోదరుడు


చంద్రంపాలెంలో భారీ మట్టి గణపతిని నిలిపిన చోటే నిమజ్జనం చేస్తున్న దృశ్యం


ఆనందపురం మండలం శొంఠ్యాంలో అన్నదానం


చంద్రంపాలెంలో చిన్న గణపతి విగ్రహ ఊరేగింపులో మహిళల కోలాటం

గణపతి నవరాత్రి ఉత్సవాలు ఘనంగా ముగిశాయి. సాంస్కృతిక కార్యక్రమాల నడుమ గణనాథులను ఊరేగింపుతో నిమజ్జనాలకు తరలించారు. చంద్రంపాలెంలో ఏర్పాటు చేసిన భారీ మట్టి వినాయకుడిని నిలిపిన చోటే నిమజ్జనం చేశారు. పవిత్ర నదీ జలాలు, పంచామృతాలు కలిపిన నీటితో అనుపు కార్యక్రమం నిర్వహించారు. భారీ గణనాథుడి చెంత పూజలందుకున్న చిన్న గణపతి విగ్రహాన్ని మేళతాళాలు, కోలాటాలతో ఊరేగించి రుషికొండ బీచ్‌లో నిమజ్జనం చేశారు.

- తగరపువలస/మధురవాడ

ఇష్టానుసారంగా ఆక్రమణలు

పట్టించుకోని అధికారులు


ఫుట్‌పాత్‌పై స్థలాన్ని ఆక్రమించి ఏర్పాటు చేసిన బడ్డీలు

భీమునిపట్నం: భీమిలి బీచ్‌రోడ్డులో ఇటీవల ఇష్టానుసారంగా ఫుట్‌పాత్‌లు ఆక్రమించి బడ్డీలు ఏర్పాటు చేస్తున్నారు. దీంతో సందర్శకులు, ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. కొద్ది నెలలుగా బీచ్ ఫుట్‌పాత్ వైపు వరుసగా బడ్డీల ఏర్పాటు జరుగుతోంది. ఇవి స్థాయికి మించిపోయి రోజుకు రెండు బడ్డీల చొప్పున వెలుస్తున్నాయి. దీంతో ఫుట్‌పాత్ వద్ద ద్విచక్ర వాహనాలతో పాటు ఇతర వాహనాలు పెట్టుకోవడానికి ఏమాత్రం వీల్లేకుండా పోతోంది. చాలా చోట్ల కబాబ్‌లు, మొక్కజొన్నలు కాలుస్తుండడంతో సాయంత్రం వేళల్లో పొగ విపరీతంగా వస్తోంది. దీంతో బెంచీలపై కూర్చునే సందర్శకులు ఇబ్బంది పడుతున్నారు. ఇక్కడ బీచ్ బస్టాప్ వద్ద నుంచి లైట్‌హౌస్ వరకు ఇదే పరిస్థితి. పరిస్థితి ఇంతలా ఉండటానికి కొందరు రాజకీయ నాయకుల అండదండలే కారణమనే ఆరోపణలున్నాయి. ఈ ప్రాంతానికి కూతవేటు దూరంలోనే జోనల్ కార్యాలయం ఉన్నా అధికారులు మాత్రం పట్టనట్లు వ్యవహరించడంతో పరిస్థితి మరింత అధ్వానంగా మారింది. దీంతో సాయంత్రం వేళల్లో బీచ్‌కు వచ్చి సేదతీరే పరిస్థితి లేకుండా పోయిందని పలువురు వాపోతున్నారు. ఇక్కడి పరిస్థితిపై జోనల్ కమిషనర్ అయ్యప్పనాయుడును వివరణ కోరగా త్వరలోనే వీటిని తొలగించి, క్రమబద్ధీకరిస్తామన్నారు.

విశేషంగా సామూహిక లక్ష్మీగణపతి హోమం

సింహాచలం : 98వవార్డు పరిధి సింహపురికాలనీలో జరుగుతున్న వినాయకచవితి మహోత్సవాల్లో భాగంగా శనివారం రాత్రి లక్ష్మీగణపతి హోమాన్ని ఘనంగా నిర్వహించారు. మండపం ప్రాంగణంలో హోమగుండాలను ఏర్పాటు చేశారు. హోమంలో పాల్గొన్న కాలనీ నివాసితులను వరసగా వేంజేంపజేశారు. విఘ్నేశ్వరపూజ, విఘ్నేశ్వర అష్టోత్తరం, మండపారాధన, అగ్నిప్రతిష్ఠ, హోమం, లక్ష్మీ సహస్రనామార్చన, పూర్ణాహుతి కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. హోమ ప్రసాదాన్ని అందజేశారు. కాలనీ అసోసియేషన్, సింహపురి యూత్ ఏర్పాట్లు పర్యవేక్షించింది.